VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 8 సంచిక : 336
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శుక్రవారం 18 ఏప్రిల్ 2025

# జపాన్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి





**హైదరాబాద్,కలంకౌంటర్ :** సీఎం రేవంత్ రెడ్డి బృందం జపాన్ పర్యటనలో తొలి రోజునే కీలకమైన పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. జపాన్ కు చెందిన వ్యాపార దిగ్గజం మారుబెనీ కంపెనీ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ను ఏర్పాటు చేసేందుకు మారుబేని కంపెనీ సంసిద్ధత తెలిపింది. టోక్యోలో ఆ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై చర్చించారు. దాదాపు రూ. 1,000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో మారుబెనీ కంపెనీ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. దశల వారీగా ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో ప్రపంచ స్థాయి, నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసుకుంది. అందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు. జపాన్ కంపెనీలతో పాటు ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఈ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేస్తారు. దీంతో దాదాపు రూ. 5,000 కోట్లకు పైగా పెట్టుబడును ఆకర్షించే అంచనాలున్నాయి. మారుబేని ఇండస్ట్రియల్ పార్క్ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగాలపై దృష్టి పెడుతుంది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నైపుణ్యం కలిగిన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు చేపడుతారు. చర్చల సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో కొత్తగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీకి మారుబేనికి స్వాగతం పలికారు. ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేసే మొట్టమొదటి పార్కు ఇదేనని అన్నారు. దీంతో తెలంగాణలో దాదాపు 30 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, జీవనోపాధి మెరుగుపడుతుందని అన్నారు. తెలంగాణలో వ్యాపారానికి అనువైన అవకాశాలున్నాయని మారుబేనికి ప్రభుత్వం తరఫున తగినంత మద్దతు ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, అందులో మారుబేని పెట్టుబడులకు ముందుకురావటం సంతోషంగా ఉందన్నారు. భారత దేశంతో జపాన్ కు ఏళ్లకేళ్లుగా ఉన్న స్నేహ సంబంధాల దృష్ట్యా పెట్టుబడిదారులు తెలంగాణను తమ స్వస్థలంగానే భావిస్తారని ముఖ్యమంత్రి మాటిచ్చారు. తెలంగాణ, హైదరాబాద్ ను అభివృద్ధి చేసేందుకు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఎంచుకున్న దార్శనికతకు మారుబేని నెక్స్ట్ జనరేషన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ దై సకాకురా అభినందించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శించారు. అక్కడున్న అవకాశాలను వినియోగించుకునేందుకు ముందువరుసలో ఉంటామని అన్నారు. మారుబేని కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410 కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్తు, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్ మొబిలిటీ రంగాలలో ఈ కంపెనీ అగ్రగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50,000 మందికి పైగా ఉద్యోగులను నియమించింది.

# జర్నలిస్టుల క్రికెట్ పోటీల కప్ ను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

**అమరావతి, కలంకౌంటర్ :** అమరావతి మీడియా ప్రతినిధులు నిర్వహించే క్రికెట్ టోర్నీ కప్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఈనెల 18, 19, 20 తేదీల్లో అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ పేరుతో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలం మూల పాడులోని ఏసీఏ క్రికెట్ స్టేడియం లో ఈ పోటీలు జరుగనున్నాయి. మీడియాలో వివిధ విభాగాలకు చెందిన మొత్తం 10 జట్లు టోర్నీలో పాల్గొంటున్నాయి. మూడు రోజులు పాటు జరిగే పోటీలకు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే నిర్వాహకులు పూర్తి చేశారు.



# మా కూటమి ప్రభుత్వానికి సహకరించండి: బ్యాంకర్స్ కు మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపు

**అమరావతి,కలంకౌంటర్ :** ప్రభుత్వం అందించే రేషన్ కోసం చాలామంది ప్రజలు ప్రతినెలా ఎదురుచూస్తున్నారని, రేషన్ అందించేందుకు, రైతుకు అండగా నిలబడేందుకు బ్యాంకర్స్ సహకరించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. విజయవాడ కానూరులో సివిల్ సప్లైస్ భవన్ లో ఈరోజు మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన బ్యాంకర్స్ తో సమావేశం జరిగింది. గత ప్రభుత్వం రైతులకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించకుండా... 1,674 కోట్ల రూపాయల బకాయిలను వదిలి వెళ్ళిందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు చెల్లించవలసిన బకాయిలను చెల్లించడం జరిగిందని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల కాలంలో దాదాపు 24 వేల కోట్ల రూపాయలను చెల్లించిందని చెప్పారు. సంస్కరణల్లో భాగంగా నూతన సాంకేతిక విధానం అవలంబించి ధాన్యం కొనుగోలుకు వాట్సాప్ విధానం ప్రవేశపెట్టిందన్నారు. వాట్సాప్ విధానంలో 17 వేల మంది రైతులు ధాన్యం అమ్మకం జరిపారన్నారు.. ఖరీఫ్ మాసంలో ఆరు లక్షల మంది రైతుల నుంచి 38 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు జరిగిన 24 గంటల్లో రైతుల ఖాతాలో నగదు జమ కావడంతో వారు ఆనందంగా ఉన్నారన్నారు. అదేవిధంగా



రేషన్ పక్కదారి పట్టకుండా రేషన్ మాఫియాపై ఉక్కు పాదం మోపడం జరిగిందని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. నూతన సాంకేతిక విధానంతో కొత్త రేషన్ కార్డులు అందించబోతున్నామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించి ప్రతి వేర్ హౌస్ గోడౌన్ వద్ద ఏఐ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్నామని, కాబట్టి బ్యాంకర్స్ వడ్డీ రేటు తగ్గించుకొని ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.

# కేంద్ర మంత్రి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు అరుదైన గౌరవం




**అమరావతి,కలంకౌంటర్ :** కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అరుదైన గౌరవం దక్కింది. యంగ్ గ్లోబల్ లీడర్స్ అవార్డుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎంపికయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా 50 దేశాలకు చెందిన 116 మందిని ఈ అవార్డుకు ఎంపిక చేసింది WEF. 40 ఏళ్ల లోపు వయస్సు ఉండి వేర్వేరు రంగాల్లో తమదైన ముద్ర వేసి, ప్రపంచ స్థితిగుతల అభివృద్ధికి కృషి చేసే యువకులకు ఏటా యంగ్ గ్లోబల్ లీడర్స్ అవార్డుల ప్రదానం చేయనుంది. రామ్మోహన్ నాయుడుతో పాటు భారత్ నుంచి యంగ్ గ్లోబల్ అవార్డుకు ఎంపికయ్యారు ఏడుగురు. ఇందులో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉన్నారు. యంగ్ గ్లోబల్ లీడర్స్ అవార్డుకు ఎంపికైన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రపంచవ్యాప్తంగా 50 దేశాలకు చెందిన 116 మందిని ఈ అవార్డుకు ఎంపిక చేసిన WEF. 40 ఏళ్లలోపు వయస్సు ఉండి వేర్వేరు రంగాల్లో తమదైన ముద్ర వేసి, ప్రపంచ స్థితిగుతల అభివృద్ధికి కృషి చేసే యువకులకు ఏటా యంగ్ గ్లోబల్ లీడర్స్ అవార్డుల ప్రదానం రామ్మోహన్ నాయుడుతో పాటు భారత్ నుంచి యంగ్ గ్లోబల్ అవార్డుకు ఎంపికైన ఏడుగురు.

# రాజధాని మోదీ అమరావతి పర్యటన ఖరారు..

## మే 2న అమరావతికి రానున్న మోదీ

**అమరావతి,కలంకౌంటర్ :** ఏపీ రాజధాని అమరావతిలో ప్రధాని మోదీ పర్యటించబోతున్నారు. అమరావతి నిర్మాణాల పునఃప్రారంభోత్సవానికి ప్రధాని హాజరుకానున్నారు. ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారయింది. మే 2వ తేదీ అమరావతికి మోదీ రానున్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు రాజధాని పనులను మోదీ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం వెనుక బహిరంగసభ వేదికను ఏర్పాటు చేయనున్నారు. ఈ వేదిక నుంచే పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మోదీ నిర్వహించనున్నారు. భద్రతా ఏర్పాట్లను ఎస్పీజీ బృందం పర్యవేక్షిస్తోంది. ప్రధాని పర్యటన ఏర్పాట్ల కోసం మంత్రుల కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల ప్రజలు హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించారు. ఈ కార్యక్రమానికి 5 లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు.



# ఏఎంసీ చైర్మన్ కొల్లూరి కి సన్మానం



**మోపిదేవి,కలంకౌంటర్ :** అవనిగడ్డ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన కొల్లూరి వెంకటేశ్వరరావు దంపతులను మోపిదేవి తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతన ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధన్ రావు, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరరావు, కోక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు కొమ్ము పవన్ కుమార్, మండల కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, నాగాయతిప్ప మాజీ సర్పంచ్ వేములపల్లి రవిచంద్ర, మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు మోర్ల జయలక్ష్మి, బళ్లా సీతారామ ప్రసాద్, పుప్పాల ఏసు, దివి యుగంధరి, గరివి శివరామకృష్ణ, పీతా కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# మే 3 నుంచి శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు



**గంపలగూడెం (ఎన్ టి ఆర్ జిల్లా)కలంకౌంటర్ :** గంపలగూడెం మండలం పెనుగొలను శివారు మెట్టగుట్టలో వేంచేసియున్న శ్రీశేషాచల శ్రీనివాసస్వామి వారి 35వ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 3 నుంచి 5 వరకు మూడురోజుల పాటు ఆలయ ప్రధానార్చకులు తూమాటి శ్యాంసుందరశ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పంది వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి కమిటీ సభ్యులకు అందజేశారు. 3న తొలిరోజైన శనివారం ఉదయం సుప్రభాతసేవ అనంతరం స్వామివారిని పెండ్లి కుమారునిగా తయారు చేస్తారు. మధ్యాహ్నం నీరాజన మంత్రం, సాయంత్రం విష్వక్షేన పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, ధ్వజారోహన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పములు, 4న(ఆదివారం) ఉదయం సుప్రభాతసేవ, ప్రాతః కాలార్చన అనంతరం 9:30 కు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీశేషాచల శ్రీనివాసస్వామి కల్యాణం వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. చివరి రోజైన ఆదివారం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహతి చేయాగా, రాత్రికి స్వామివారి పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. మూడు రోజులు పాటు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. పీటలపై కూర్చోదలచుకునే దంపతులు ఉంటే కమిటీని సంప్రదించగలరు.

# పుప్పాలగూడ పరిసరాల్లో 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్

- 5 లక్షల మంది యువతకు ఉపాధి ప్రభుత్వ లక్ష్యం
- మొదటి దశలో ఏర్పాటు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన సమావేశమైన మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





**హైదరాబాద్,కలంకౌంటర్ :** పుప్పాలగూడ పరిసరాల్లో సుమారు 450 ఎకరాల్లో మొదటి దశలో ఐటి నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, పరిశ్రమల, రెవెన్యూ శాఖ కీలక అధికారులతో వారు సమావేశం నిర్వహించారు. పుప్పాల గూడ పరిసరాల్లో ఎమ్మెల్యే లు, ఎంపీలు, ఐఏఎస్ అధికారుల కోసం ప్రభుత్వం గతంలో స్థలాలు కేటాయించింది. వీరితోపాటు రెవిన్యూ అధికారులు, స్పెషల్ పోలీస్ మ్యూచువల్ కో-ఆపరేటివ్ సొసైటీ తదితర సొసైటీలకు సుమారు 200 ఎకరాలకు పైచిలుకు భూమిని ప్రభుత్వం కేటాయించింది. పుప్పాలగూడ పరిధిలో సొసైటీలకు కేటాయించిన భూములను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధికారులు సబ్ కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ భూమికి పక్కనే ఇండస్ట్రియల్ కార్పొరేషన్ కు సంబంధించిన సుమారు 250 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లుగా అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తంగా మొదటి దశలో ఐటి నాలెడ్జ్ హబ్ అభివృద్ధికి సుమారు 450 ఎకరాలు అందుబాటులో ఉంది అని చెప్పారు. మొదటి దశలో ఏర్పాటు చేయబోతున్న ఐటీ హబ్ ద్వారా ఐదు లక్షల మంది యువతకు ఉపాధి లభిస్తుందని అధికారులు మంత్రుల బృందానికి సూచించారు. కాంగ్రెస్ మ-ుఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలో హైటెక్ సిటీకి శంకుస్థాపన జరిగింది, ఆ తర్వాత నాలెడ్జ్ హబ్ ఏర్పాటయింది, ఆ తర్వాత ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ రూపు దిద్దుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగాల్లో వచ్చిన ప్రతి మార్పులో హైదరాబాద్ భాగస్వామి అయిందని, ఇప్పుడు కూడా ఐటీ రంగంలో ఏ I టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పును హైదరాబాద్ అందిపుచ్చుకోవా లని మంత్రుల సబ్ కమిటీ నిర్ణయించింది. హైదరాబాద్ ఆర్థిక అభివృద్ధిలో సుస్థిర స్థానాన్ని ఇప్పటికే సాధించింది, హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకోవడం సాధ్యం కాదని ఆర్థికవేత్తలు స్పష్టం చేసిన విషయాన్ని మంత్రులు చర్చించారు. అభివృద్ధిని కొనసాగించే క్రమంలో పుప్పాలగూడలో 450 ఎకరాల్లో నాలెడ్జ్ హబ్ అభివృద్ధి చేస్తూ దశాబ్దాలుగా కొనసాగుతున్న హైదరాబాద్ ప్రగతిని వేగవంతం చేయాలని నిర్ణయించారు.

# టిటిడి సేవలను అభినందించి సూచనలు చేసిన ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ





**తిరుపతి,కలంకౌంటర్ :** శ్రీవారి భక్తులకు టిటిడి అందిస్తున్న సేవలపై ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ సంతృప్తిని వ్యక్తం చేసింది. గతంలో భక్తులకు అందిస్తున్న సేవలకు, ప్రస్తుతం అందిస్తున్న సేవలలో చాలా మార్పు కనిపిస్తోందని ఏపీ శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మెన్ వేగుల్ల జోగేశ్వర రావు వెల్లడించారు. శ్రీవారి భక్తుల సేవ నిరంతరం సేవ అని, శ్రీవారి భక్తులకు మరింత నాణ్యంగా అందిస్తూ శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని సూచించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతీ అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏపీ అసెంబ్లీ అంచనాల కమిటీ ఛైర్మెన్ వేగుల్ల జోగేశ్వర రావు మాట్లాడుతూ, అంచనాల కమిటీ చేసిన పలు సూచనలను పరిగణలోకి తీసుకుని మరింత నాణ్యంగా సేవలు అందించాలని సూచించారు. వైద్య సేవలపై అభినందనలు : ఇటీవల తాను శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చానని, అనుకోకుండా అనారోగ్యానికి గురై తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో చేరగా వైద్య సేవలు చాలా నాణ్యతగా, సేవాతత్వంతో అందించారని ఏపీ అంచనాల కమిటీ సభ్యులు పెన్మత్స వరాహ వెంకట సూర్యనారాయణ రాజు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశ్విని ఆసుపత్రి సిబ్బందిని ఆయన అభినందించారు. టిటిడిలో అమలవుతున్న సేవలపై సభ్యులు సంతోషం వ్యక్తం చేయగా, పరిశుభ్రత, పారిశుధ్యం - తిరుమలలో పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, భక్తులు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సేవలు అందుతున్నాయన్నారు. వసతి గదుల నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని సభ్యులు సూచించారు. నవతరానికి శ్రీవారి వైభవాన్ని తెలియజేసేలా డిజిటల్ మీడియాను మరింత బలోపేతం చేయాలని సూచించారు. శ్రీవారి సేవ - రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు శ్రీవారి సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని టిటిడి ఈవో వెల్లడించారు. వివిధ విభాగాలలో నైపుణ్యం, నిపుణుల సేవలను అన్ని విభాగాలలో అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఈవో తెలిపారు. అదే విధంగా తిరుమలలో క్రమం తప్పకుండా టిటిడి సేవలపై ప్రకటనలు ఇవ్వాలని, టిటిడి వసతి గృహాలలో అన్ని చోట్ల శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీపద్మావతి అమ్మవారి చిత్ర పటాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వామివారి కీర్తనలు, గోవింద నామావళిని రాత్రి 10 గం.ల వరకు వినిపించేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరగా, టిటిడి ఈవో సమాధానం ఇస్తూ, ఇప్పటికే ప్రత్యేక చర్యలు చేపట్టామని, మరింత పటిష్టంగా అమలు చేస్తామని ఈవో చెప్పారు. తిరుమలలో వసతి గదుల నిర్మాణాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఈవో సమాధానం ఇస్తూ, కాలం చెల్లిన భవనాల స్థానంలో కొత్త భవనాలు, మరమ్మత్తులు మినహా హైకోర్టు నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపట్టలేదని వివరించారు. వసతి గదుల నిర్వహణపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామని ఈవో తెలిపారు. కాషన్ డిపాజిట్ ను భక్తులకు సకాలంలో చెల్లించేందుకు మరింత పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. ఒకరి పేరుతో వసతి గది తీసుకుని మరొకరు వచ్చి ఫేస్ రికగ్నిషన్ కోసం రావడం వల్ల చెల్లింపులో ఆలస్యం కావడం మినహా, కాషన్ డిపాజిట్ ను సంబంధిత వ్యక్తులకు సకాలంలో చెల్లింపు చేస్తున్నామన్నారు. వైకుంఠం -1, 2 లలో భక్తులకు అందిస్తున్న అత్యవసర వైద్య సేవలపై సభ్యులు అడిగి తెలుసుకున్నారు. శ్రీవాణి ట్రస్ట్ పై సభ్యులు అడిగిన సమాచారాన్ని సభ్యులకు ఈవో తెలియజేశారు. టిటిడి ఆధ్వర్యంలో చేస్తున్న స్వామివారి, అమ్మవారి రాతి విగ్రహాల తయారీ, పంపిణీ వివరాలను సభ్యులు అడగగా, ఈవో మాట్లాడుతూ, హిందూ ఆలయాలకు 5 అడుగుల లోపు స్వామివారు, అమ్మవారి విగ్రహాలను ఉచితంగా అందిస్తామని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారుల ప్రాంతాలలో ఉచితంగా సప్లయ్ చేస్తామని ఈవో చెప్పారు. తిరుమలలో భక్తులకు అందిస్తున్న సేవలపై శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి ఏపీ అంచనాల కమిటీ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంచనాల కమిటీ సభ్యులు భూమా అఖిలప్రియ, నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, డా. వాల్మీకి పార్థసారథి, పాశిం సునీల్ కుమార్, ఏలూరు సాంబశివరావు, వరుదు కళ్యాణి, పెన్మత్స వరాహా వెంకటసూర్య నారాయణ రాజు, టిటిడి జేఈవో వి. వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరు భేష్

- 16వ ఆర్థిక కమిషన్ బృందం







**తిరుపతి,కలంకౌంటర్ :** తూకివాకంలోని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ పనితీరు బాగుందని 16వ ఆర్థిక కమిషన్ బృందం కితాబిచ్చారు. గురువారం తూకివాకం నందలి తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ (చెత్త నుండి సంపద కేంద్రం) ను పరిశీలించిన 16వ ఆర్థిక కమిషన్ బృంద సభ్యులు రిత్విక్ పాండే, అన్నే జార్జ్ మ్యాథ్యూ, కేకే మిశ్రా, అభయ్ మీనన్, ఆదిత్య పంత్, అమృత తదితర సభ్యులు పరిశీలించగా సదరు ప్లాంట్ నందు ఘన వ్యర్థాల నిర్వహణ, తడి చెత్త నిర్వహణ కంపోస్టు, బయో మెథనైజేశన్ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ తదితర యూనిట్ల గురించి ప్రిన్సిపాల్ సెక్రటరీ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ సురేష్ కుమార్, జే.నివాస్, తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ శ్రీమతి మౌర్య పలు అంశాలు వివరించారు. ఈ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా సుస్థిర వ్యవస్థ ఏర్పాటుతో చెత్త నుండి సంపద తయారీ విధానంపై వివరించారు. తిరుపతి నగరంలో సేకరించిన తడి, పొడి చెత్త ద్వారా ఏర్పడిన పొడి చెత్త నిర్వహణ చేస్తారని, ఇందులో వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు తదితరాలను ప్రాసెసింగ్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తారని, తడి చెత్త ను నిర్వహణ చేసి కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తారని, ఇక మార్కెట్ నుండి వెలువడే వ్యర్థాలు, హొటల్స్ నుండి సేకరించిన వ్యర్థాలను నిర్వహణ చేసి వంట గ్యాస్ ను ఉత్పత్తి చేసి విక్రయించడం జరుగుతుందని తెలిపారు. నగరంలో ప్రతిరోజూ ఉత్పతి అయ్యే సుమారు 25 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను నిర్వహణ చేసి ఆరు రకాలుగా గుల్ల, ఇసుకగా మారుస్తారని, ఇలా ఉత్పతి అయిన ఇసుక, గుల్ల తో పేవర్స్ తయారు చేస్తారని తెలిపారు. ప్రతిరోజూ తడి చెత్త 150 టన్నులు, 75 టన్నులు పొడి చెత్త నిర్వహణ చేయడం జరుగుతుందని తెలిపారు. ట్రీటెడ్ వేస్ట్ నీటిని పరిశ్రమలకు విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, లైజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ప్రాజెక్టులో రెండో రోజు కొనసాగిన మట్టి నాణ్యత పరీక్షలు

- పాల్గొన్న కేంద్ర బృందం సభ్యులు, జలవనరుల శాఖ అధికారులు





**పోలవరం,కలంకౌంటర్ :** పోలవరం ప్రాజెక్టు పరిధిలో మట్టి నాణ్యత పరీక్షలు రెండో రోజు గురువారం కూడా కేంద్ర నిపుణుల బృందం చేసింది. సెంట్రల్ మెటీరియల్ అండ్ సాయిల్ రీసెర్చ్ సెంటర్ నిపుణులు బి. సిద్దార్థ్ హెడావో, విపుల్ కుమార్ గుప్తా, జలవనరుల శాఖ అధికారి నిర్మల తదితరులు రెండోరోజు దండంగి, పోలవరం జల విద్యుత్ కేంద్రం పరిసరాలతో పాటు పలు ప్రాంతాల్లో మట్టి నమూనాలు సేకరించారు. ఈ మట్టిని స్థానికంగా లేబరేటరీలో పరీక్షించడం తో పాటు, మరింత సూక్ష్మంగా తమ కేంద్ర కార్యాలయం లో పరీక్షించే oదుకు సేకరించారు. స్థానికంగా, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ సెంటర్ లో నిర్వహించే పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా పోలవరం ప్రాజెక్టులో అవసరమైన ప్రాంతాల్లో అవసరమైన మేర ఈ మట్టిని వినియోగిస్తామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. మట్టి నాణ్యతా పరీక్షల్లో జలవనరుల శాఖ డీఈ వి.నిర్మల, ఈఈ డి శ్రీనివాసులు, నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మల్లేశ్వరం మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ఒడుగు





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** మల్లేశ్వరమ్ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా కృత్తి వెన్ను మండల తెలుగు దేశం పార్టీ సీనియర్ తెలుగుదేశం నాయకులు మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ఒడుగు తులసిరావు నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారాయణ లోకేష్ ప్రతిష్టాత్మకంగా ఎంపిక చేసిన మార్కెట్ యార్డ్ చైర్మన్ల ఎంపికలో మల్లేశ్వరం మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ఒడుగు తులసిరావు ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుల జరిపినఈ నియామకంపై బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీల కూటమి శ్రేణులు హర్షా తిరేఖలు వ్యక్తం చేస్తున్నాయి. మల్లేశ్వరం మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ఎంపికైన ఒడుగు తులసి రావు రాజకీయ ప్రస్థానంలో తొలి అడుగు మార్గం గ్రామ వైస్ ప్రెసిడెంట్ గా ప్రారంభమైంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం 1983 నుండి తులసి రావు తెలుగుదేశం పార్టీలోఉంటూ కీలక పదవులను అలంకరించారు. తులసి రావు 1982 సంవత్సరంలో మాట్లం పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ గా చేశారు .1985లో కోపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ గా పని చేశారు 2014లో జడ్పిటిసి గా ఎన్నికయ్యారు 20 సంవత్సరాలు పాటు మండల పార్టీ సెక్రటరీగా ఏడు సంవత్సరాలుగా మండల టిడిపి అధ్యక్షులుగా ప్రస్తుతం కుర్తి వెన్ను మండల పార్టీ కార్యదర్శిగా పార్టీకి ప్రజలకు విశేష సేవలు అందించిన ఒడుగు తులసిరావు. మల్లేస్వరం మార్కెట్ యార్డ్ చైర్మన్గా ఎంపి కయ్యారు. తనను మార్కెట్ చైర్మన్ గా ఎంపిక చేయడం పట్ల పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అలాగే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు.

# సంఘటితశక్తిగా విజయా డైరీ - చైర్మన్ చలసాని ఆంజనేయులు



**హనుమాన్ జంక్షన్,కలంకౌంటర్ :** వీరవల్లి కృష్ణా మిల్క్ యూనియన్ కామదేనులో బుధవారం జరిగిన దాసాంజనేయ ప్రతిష్ఠ వైభవంగా జరిగిందని అది మీ అందరి సహకారంతోనేనని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు, గురువారం సాయంత్రం వీరవల్లి కామదేను లో. జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ దాసాంజనేయ ప్రతిష్ట మహొూత్సవానికి అనేకమంది ప్రముఖులు హాజరయ్యారని వారందరికీపేరుపేరున కృతజ్ఞతలు తెలియజేసారు, కృష్ణా , గోదావరి జిల్లాలలోని 1200 గ్రామాల నుండి 25,000 వేల మంది కృష్ణా మిల్క్ యూనియన్ రైతులు, సొసైటీ అధ్యక్షులు, డైరెక్టర్లు, అభిమానులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఇంతకంటే నాకేం కావాలని అన్నారు అందరి ఆశీర్వాదాంతో నేనింతటి వాడినయ్యానని అన్నారు, ప్రతి నిముషం ప్రజల్లో ఉండాలనేది నా ఆలోచన అని. అన్నారు, ఇదే స్పూర్తితో రైతాంగానికి వెన్ను దన్నుగా ఉండాలానేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన అని అదే స్ఫూర్తితో తాను రైతాంగానికి 100 శాతం సేవలందిస్తానని అన్నారు.

# ఆర్ హెచ్ వి ఎస్ జిల్లా అధ్యక్షులుగా సుందర కుమార్

- మే 14 నుంచి 26 వరకు బద్రీనాథ్ లో సరస్వతీ పుష్కరాలు
- త్వరలో ఆర్ హెచ్ వి ఎస్ ప్రాంతీయ కార్యాలయం తిరుపతిలో ప్రారంభం



**తిరుపతి, కలంకౌంటర్ :** రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ( ఆర్ హెచ్ వి ఎస్ ) జిల్లా అధ్యక్షులుగా కీర్తిపాటి సుందర్ కుమార్ ను నియమించినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండ్రాజు సుకుమార్ రాజు తెలిపారు. గురువారం స్థానిక మన తిరుపతి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అయోధ్య ప్రధాన కేంద్రంగా ఏర్పాటైన రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ముఖ్య సంరక్షకులు మహంతు వైదేహి వల్లభ శరన్ దాస్ మహారాజ్, జాతీయ అధ్యక్షులు రమేష్ చంద్ర ద్వివేది (రాజు భయ్యా), జాతీయ ప్రధాన కార్యదర్శి నవీన్ చంద్ర శుక్ల లచే నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. హిందూ సామ్రాజ్యం లో రామ రాజ్య స్థాపన కోసం, సనాతన హైందవ ధర్మాన్ని, ఆధ్యాత్మిక భావాలను క్షేత్రస్థాయిలో ప్రతి గడపకు చేరాలనే సంకల్పంతో శ్రీవారి పాదాల చెంత తిరుపతి నుంచి శ్రీరామ రథయాత్రను ఈ ఏడాదిలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా రామ రాజ్య స్థాపనే ఎజెండాగా ఏర్పాటైన ఆర్ హెచ్ వి ఎస్ వేగవంతంగా అడుగులు వేస్తోందన్నారు. ఈ నెలలో ఆర్ హెచ్ వి ఎస్ ప్రాంతీయ కార్యాలయాన్ని తిరుపతి నగరంలో ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. తిరుపతి నుంచి శ్రీరామ రథయాత్ర ప్రారంభమై అయోధ్య వరకు కొనసాగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూపీ ముఖ్యమంత్రి వర్యులు యోగి ఆదిత్యనాథ్ లతోపాటు శ్రీలంక, మారిషస్ ప్రధానులు, నేపాల్ కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత ఎంపీ అనిత దేవి సాహూ,తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఉపసభాపతి రఘురామకృష్ణమ రాజు ( ఆర్ ఆర్ ఆర్) ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు సుందర కుమార్ మాట్లాడుతూ హైందవ ధర్మం కోసం, ఆధ్యాత్మిక చింతన కోసం, శ్రీరామ రాజ్య స్థాపన కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ మహా యజ్ఞంలో తమకు భాగస్వామ్యం కలగడం దైవ సంకల్పంగా భావిస్తూ తమ వంతు శక్తివంచన లేకుండా ఆర్ హెచ్ వి ఎస్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ హెచ్ వి ఎస్ ఆధ్వర్యంలో సీతా సమేత శ్రీరామ సేవకులను అతి త్వరలో నియమించనున్నట్లు గిరి రాజు తెలిపారు. తిరుపతి నుంచి ప్రారంభమయ్యే శ్రీరామ రథయాత్ర విజయవంతా నికి ఇప్పటినుంచి ప్రణాళికాబద్ధం గా వ్యవహరించి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తమకు ఈ బాధ్యత అప్పగించినందుకు జాతీయ అధ్యక్ష కార్యదర్శులు రమేష్ చంద్ర ద్వివేది (రాజు భయ్యా), నవీన్ చంద్ర శుక్ల, దక్షిణ భారతదేశ బాధ్యులు కృష్ణ కిషోర్, రాష్ట్ర అధ్యక్షులు గొర్రె శ్రీనివాసులు,ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుకుమార్ రాజు, టీటీడీ కాంట్రాక్టర్ గిరిరాజు లకు అభినందనలు తెలియజేశారు.

# మరణించిన పోలీసు కుటుంబానికి అండగా నిలిచిన బ్యాచ్ మేట్స్ - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

- మరణించిన ఆర్మడ్ రిజర్వు కానిస్టేబులు గోపాలరావు కుటుంబానికి బ్యాచ్మేట్స్ ప్రోగు చేసిన రూ.3.60లక్షల నగదు



**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లా పోలీసుశాఖలో పని చేసి, ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించిన ఎఆర్ కానిస్టేబులు కుటుంబానికి సహోద్యోగులు ఆర్థికంగా అండగా నిలిచి, ఇతర బ్యాచ్ పోలీసులకు ఆదర్శంగా నిలిచారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - పోలీసుశాఖలో పని చేస్తూ ఇటీవల అనారోగ్య కారణాలతో సిహెచ్.గోపాలరావు అనే ఆర్మ్ డ్ రిజర్వు కానిస్టేబులు మరణించారన్నారు. ఈ కానిస్టేబులు కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని భావించిన 2000సం. కు చెందిన ఎపిఎస్పీ , ప్రస్తుతం ఎఆర్ కన్వర్షన్ గా బదిలీపై వచ్చి, ఎఆర్ లో విధులు నిర్వహిస్తున్న మిలీనియం బ్యాచ్ పోలీసు కానిస్టేబుళ్ళు స్వచ్ఛందంగా రూ.3.60 లక్షలను ప్రోగు చేసారన్నారు. అర్ధంతరంగా తమ కుటుంబ యజమానిని కోల్పోయి, ఆర్థికంగా నష్టపోయిన సమయంలో వారికి ప్రభుత్వం నుండి బెనిఫిట్స్ అందేంత వరకు వారి కుటుంబానికి ఆర్థికంగా ఆదుకొనేందుకు ఈ మొత్తం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ తరహా చర్యలు చేపట్టడం వలన పోలీసు ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడంతోపాటు, వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా లభిస్తుందన్నారు. చక్కని ఆలోచనతో నగదు ప్రోగు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన 2000 మిలీనియం బ్యాచ్ ఎఆర్, ఎపిఎస్పీ పోలీసు కానిస్టేబుళ్ళను జిల్లా ఎస్పీ అభినందించారు. ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం సకాలంలో కల్పించే విధంగా చర్యలు చేపడతామని, వెంటనే దరఖాస్తు చేయాలని, ఇతర ధృవీకరణ పత్రాలను జిల్లా పోలీసు కార్యాలయానికి అందజేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. 2000సం.లో ఎపిఎస్పీ కానిస్టేబుళ్ళుగా ఎంపికై ఎపిఎస్పీలో పనిచేస్తున్న కానిస్టేబుళ్ళు రూ.2.50లక్షలు ప్రోగు చేయగా, ఆర్మ్ రిజర్వుకు కన్వర్షనుగా వచ్చిన పోలీసు కానిస్టేబుళ్ళు రూ. 1.10 లక్షలను ప్రోగు చేసారన్నారు. ప్రోగు చేసిన రూ.3.60 లక్షల నగదును జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ చేతుల మీదుగా మరణించిన కానిస్టేబులు సిహెచ్.గోపాలరావు సతీమణి సిహెచ్.శారదకు జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, ఆర్ఐలు ఎన్.గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.శ్రీనివాస రావు, మిలినీయం బ్యాచ్ పోలీసు కానిస్టేబుళ్ళు ఎన్. వెంకటేశ్వరరావు, ఉమా మహేశ్వరరావు, టీ.పైడితల్లి, కృష్ణ మోహన్, శేషగిరి, రమేష్, మోహన్, రమేష్, హరి శంకర్, చిట్టిబాబు, సీతారాం, చక్రధర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా - జిల్లా ఎస్పీ ఏ. ఆర్ దామోదర్





**ఒంగోలు,కలంకౌంటర్ :** ప్రకాశం జిల్లా పరిధిలో లా & ఆర్డర్, నేరాలు & ట్రాఫిక్ నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, విపత్తు నిర్వహణ , ఇతర పోలీసింగ్ అవసరాల కొరకు కొమరోలు మండలం, పురుషోత్తంపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ముత్యాల రామిరెడ్డి అనే వ్యక్తి మరియు పీసీ పల్లి మండలం, లక్ష్మక్క పల్లి గ్రామానికి చెందిన బద్దల రత్నారెడ్డి ( కాంట్రాక్టర్) గురువారం మార్కాపురంలోని సౌజన్య కన్వెన్షన్ హాల్ లో నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ కి అత్యాధునిక సాంకేతికత కూడిన DJI Air3s డ్రోన్ కెమెరాలను అందచేసారు. జిల్లా పోలీస్ శాఖకు సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తితో పోలీస్ శాఖకు డ్రోన్ లను బహుకరించడం అభినందనీయమన్నారు. డ్రోన్ లను కొమరోలు , పీసీ పల్లి పోలీస్ స్టేషన్ లకు జిల్లా ఎస్పీ అందచేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీని వినియోగించి, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు, ప్రతీ పోలీసు స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ఏరియాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు/నిశిత ప్రాంతాలను, బహిరంగ ప్రదేశాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. విఐపిల బందోబస్తులలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయలు జరగకుండా డ్రోన్ కెమెరాలను ఉపయోగించడం జరుగుతుందని, ముఖ్య కూడళ్ళలో ట్రాఫిక్ నియంత్రణ, సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్ వినియోగిస్తున్నట్లు తెలిపారు. కొమరోలు పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ , శాంతి భద్రతల కొరకు ప్రజలకు సీసీ కెమెరాలు మీద కొమరోలు కానిస్టేబుల్ శివరామకృష్ణ అవగాహన కల్పించి ఆ పోలీస్ స్టేషన్ పరిధిలో 14 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. జిల్లా ఎస్పీ కానిస్టేబుల్ శివరామకృష్ణను అభినందించి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ నాగరాజు, కనిగిరి డిఎస్పి ఈశ్వర్ సాయి యశ్వంత్, కనిగిరి సీఐ ఖాజావలి, గిద్దలూరు సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై జై నాగరాజు, పీసీ పల్లి ఎస్ఐ కోటయ్య, ముత్యాల రామిరెడ్డి కుటుంబ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి, రత్నారెడ్డి బంధువులు అంజిరెడ్డి గ్రామ సర్పంచ్ మాలకొండయ్య , సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ సమస్యకు నేటితో పరిష్కారం

- కూటమి ప్రభుత్వానికి , ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు



**కందుకూరు,కలంకౌంటర్ :** నియోజకవం-గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ పై బుధవారం మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ లను ఏ బి సి డి లుగా వర్గీకరించాలనే డిమాండ్ తో పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పేరుతో ఉద్యమాన్ని మొదలుపెడితే ఆనాటి నుండే ఎస్సీ వర్గీకరణకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని ప్రకటించడమే కాకుండా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన ఏకైక నాయకుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. 1999 - 2004 మధ్యకాలంలో ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎస్సీలను ఏ బి సి డి లు గా వర్గీకరించి ఎస్సీల మధ్య విభేదాలు లేకుండా విద్య ఉద్యోగ రంగాలలో సమన్యాయం చేశారన్నారు. 2004లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని సుప్రీంకోర్టు ద్వారా వర్గీకరణను రద్దు చేయడం జరిగిందని తద్వారా మలిదశ ఉద్యమాన్ని మొదలుపెట్టిన మంద కృష్ణ మాదిగ కు చంద్రబాబు నాయుడు సహకారం అందించి మాదిగలకు అండగా నిలిచారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాదిగలకు సంక్షేమ రంగాలలో అవకాశాలు కల్పించాలనే సహృదయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీవో నెంబర్ 25 తీసుకువచ్చి ఎస్సీలకు సమన్యాయం చేశారు. 2024 ఆగస్టు ఒకటో తేదీన సుప్రీంకోర్టు వర్గీకరణ చేసుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని తీర్పునివ్వడం ద్వారా ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసి సమన్యాయం చేయాలనే ఆలోచనతో డాక్టర్ రాజీవ్ రంజాన్ మిశ్రా తో ఏకసభ్య కమిషన్ ను నియమించడం ద్వారా ఉమ్మడి 13 జిల్లాలలో పర్యటించిన కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన వెంటనే ఎస్సీలను ఏ బి సి మూడు గ్రూపులుగా క్యాబినెట్ ఆమోదంతో ఆర్డినెన్స్ ద్వారా వర్గీకరణ చేయడం జరిగిందని ఎస్సీ వర్గీకరణ చేయడం ద్వారా ఎస్సీలలోని 59 ఉపకులాలకు సమన్యాయం జరిగిందని ఎస్సీలు సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకు ఎస్సీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమ%శీ%లో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాసరావు ,ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య ,నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, , ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ రఫీ, గుడ్లూరు మండలం ఎస్సీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లాలో 800 కోట్లతో విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు

## - విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లాలో 800 కోట్ల రూపాయల వ్యయంతో పలు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్తును సరఫరా చేస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం మంత్రివర్యులు మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి, పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ లతో కలిసి పెనమలూరు నియోజకవర్గం లోని ఉయ్యూరులో టిడ్కో గృహ సముదాయం వద్ద 4.36 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ అవుట్డోర్ విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ ఉయ్యూరు లోని టిడ్కో గృహాలు, శ్రీనివాస్ నగర్, సౌభాగ్యనగర్, శాంతినగర్, వివేకానంద నగర్ ప్రాంతాలకు అవసరమైన విద్యుత్తును ప్రస్తుత విద్యుత్ ఉపకేంద్రం నుండి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఉయ్యూరు లోనే ఇంకొక 132 కెవి విద్యుత్ ఉపకేంద్రం శంకుస్థాపన చేసి మధ్యలో వదిలేశారని శాసనసభ్యులు చెబుతున్నారని దానికి సంబంధించి కూడా శాఖ పరంగా ఫీజిబిలిటీ నివేదికను తెప్పించుకొని నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పెడన నియోజకవర్గం, ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలోను పలు విద్యుత్ ఉప కేంద్రాలు కావాలని కోరుతున్నారన్నారు. అంతే కాకుండా ప్రస్తుతం బందరు ఓడరేవు నిర్మాణం శరవేగంగా జరుగుతోందని దాని కార్యకలాపాలకు విద్యుత్ అవసరాలు చాలా ఉన్నాయన్నారు. ఇందుకోసం కృష్ణాజిల్లాలో 800 కోట్ల రూపాయల వ్యయంతో వివిధ రకాల విద్యుత్ ఉపకేంద్రాలను నెలకొల్పుటకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సంవత్సరం విద్యుత్ వినియోగం 6 నుంచి 8 శాతం పెరుగుతొందన్నారు. అందుకు అనుగుణంగా విద్యుత్తును ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అమరావతిలో రాష్ట్ర మ-ుఖ్యమంత్రి చొరవతో 400 కే.వి గెస్సోలిన్ విద్యుత్ ఉప కేంద్రాన్ని 6 వేల కోట్ల రూపాయల వ్యయంతో సాంకేతికతను ఉపయోగించుకొని 80 ఎకరాలకు బదులుగా కేవలం 8 ఎకరాల్లోనే శంకుస్థాపన చేశామన్నారు. దేశంలో గాలిమరలు, సౌరఫలకాల ద్వారా పునరుత్పాదక శక్తిని పెంపొందించుకునేందుకు మన రాష్ట్రం చాలా అనుకూల ప్రాంతంగా ఉందన్నారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలు, ఇటీవల ప్రకాశం జిల్లా చాలా అనుకూల ప్రాంతాలుగా ఉన్నాయన్నారు. ప్రతి ఇంటికి విద్యుత్ ఖర్చు పెరుగుతుందన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ కింద కేంద్ర ప్రభుత్వం 1 కిలోవాటుకు 30 వేల రూపాయలు, రెండు కిలోవాట్లకు 60 వేల రూపాయలు, మూడు కిలోవాట్లకు 78,000 రాయితీలు కల్పిస్తోందన్నారు. ప్రతి ఇంటిపైన సౌరఫలకాలు ఏర్పాటు చేసుకుని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో నాలుగున్నర లక్షల కనెక్షన్లు కావలసి ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రి లేఖ రాయగానే ప్రధానమంత్రి మూడు లక్షల కనెక్షన్లు మంజూరు చేయుటకు చేయడం జరిగిందన్నారు. ఎస్సీ ఎస్టీలకు మన రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చుభరిస్తోందని, బీసీలకు మాత్రం 20 వేల రూపాయలు అదనపు సహాయం అందిస్తోందన్నారు. వెండారులను వెంటనే పిలిచి పనులు మొదలు పెట్టాలన్నారు ఫలితాలు వస్తేనే ప్రజలు మొగ్గు చూపుతారని, ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించి గ్రామానికి 10 మంది చేత సూర్య ఘర్ సౌరఫలకాలు ఏర్పాటు చేయించాలన్నారు. .రాష్ట్రంలో 20 లక్షల సూర్య ఘర్ కనెక్షన్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. అందులో ప్రతి నియోజకవర్గానికి 10 నుండి 12 వేల కనెక్షన్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు ప్రతి విద్యుత్ కేంద్రం వద్ద సౌరఫలకాలను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసి రెగ్యులర్ లైనులకు సరఫరా చేస్తామన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని రహదారుల కోసం మొదటి దశలో 800 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, రెండో విడతలో మరల 600 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నామన్నారు. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణం అన్ని మౌలిక సదు-పాయాలతో త్వరలో పూర్తి చేస్తామని ఇందుకోసం బ్యాంకులతో అనుసంధానం చేస్తున్నామన్నారు.తమ ప్రభుత్వం ప్రజలపై ఎలాంటి విద్యుత్ చార్జీల పెంపు భారం వేయలేదని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సాక్షి దినపత్రిక కేవలం తప్పుడు రాతలు రాస్తుందని ఆ రాతలు మానుకోవాలని హితవు పలికారు.గత ప్రభుత్వం ఎఫ్ పి పి సి ఏ చార్జీల కింద వసూలు చేయాలని నిర్ణయించడంతో ఆచార్జీలు వసూలు చేయడం జరుగుతుందన్నారు. అంతేగాని తమ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచలేదని స్పష్టం చేశారు. తాము 2019లో మిగులు బడ్జెట్ తో అప్పటి కొత్త ప్రభుత్వానికి అప్పజెప్పామన్నారు. ప్రజలందరూ ఈ విషయం అర్థం చేసుకోవాలని కోరారు. వ్యవసాయానికి 9 గంటలు, ఇళ్లకు 24 గంటలు విద్యుత్ సరఫరా కోసం దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, వైర్లు మార్చడానికి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కలిసి10 వేలకోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. రెండో విడతలో మరో 17 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నామన్నారు. ఉత్పత్తి అయిన విద్యుత్తు వృధా కాకుండా 1000 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజ్ చేసుకునేందుకు వీలుగా ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారని అందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంతో త్వరలో టెండర్లు పిలవడం జరుగుతుందన్నారు. మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ లో వోల్టేజ్ సమస్యతో బాధపడుతున్న ప్రజలకు ఈ విద్యుత్ ఉప కేంద్రం వలన ఎంతో ప్రయోజనం చేకూరుతున్నదన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో 230 కె.వి విద్యుత్ ఉప కేంద్రముల ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. బందరు ఓడరేవు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అక్కడ 132, 220, కెవి విద్యుత్ ఉప కేంద్రాల అవసరం చాలా ఉందన్నారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. తద్వారా నియోజకవర్గంలో విద్యుత్ సమ-స్యలు తీరడమే కాకుండా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కూడా రాబోతున్నాయన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం పై జిల్లాలో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. కాలుష్యం పెరిగిపోయి మనిషి జీవితకాలం తగ్గిపోతోందని, కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర మ-ుఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నారన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి వేయించి నీటిని సరఫరా చేసే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్ మాట్లాడుతూ గత మూడు నాలుగు సంవత్సరాలుగా నిర్మాణంలో ఉండి ఈ విద్యుత్ ఉపగేంద్రం ఆగిపోయిందని నేడు నిర్మాణం పూర్తి కావడంతో ఉయ్యూరు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఏ చిన్న గాలి వచ్చినా లో వోల్టేజ్ సమస్యతో ప్రజలు రాత్రంతా చీకట్లో ఉండి చాలా ఇబ్బందులు పడే వారన్నారు. గత ఆరు సంవత్సరాల కిందట శంకుస్థాపన చేసిన132 కెవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం మధ్యలో ఆగిపోయిందన్నారు. ఈ కేంద్రం పూర్తయితే ఇంకా రెండు మూడు మండలాల ప్రజలకు విద్యుత్ సమస్యలు తప్పుతాయన్నారు. ఏదైనా విద్యుత్ సమస్య వస్తే విజయవాడ, గంగూరు, పామర్రు విద్యుత్ కేంద్రాల నుండి విద్యుత్తు సరఫరా చేయాల్సి వస్తుందన్నారు. రాను రాను ఉయ్యూరు పట్టణంలో కూడా విద్యుత్ వినియోగం బాగా పెరిగిందన్నారు. నియోజకవం-గంలో 2500 టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టడం జరిగిందని, 90% పూర్తయ్యాయని, అన్ని మౌలిక సదుపాయాలతో వచ్చే మూడు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. పి.ఎం సూర్యాఘర్ పథకం చాలా మంచిదని తాను తన కార్యాలయము, ఇంటికి సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకుని ఖర్చు తగ్గించుకున్నానని ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ ప్రభుత్వం వచ్చాక గత ఎనిమిది నెలలుగా నియోజకవర్గంలో 26 కోట్ల రూపాయల ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీలో 27 కోట్ల రూపాయల వ్యయంతో వేగంగా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అలాగే తాడిగడప మున్సిపాలిటీలో 10 కోట్ల రూపాయలు వ్యయంతో పనులు జరిగాయి అన్నారు. ఇంకనూ మరో 20 కోట్ల రూపాయల వ్యయంతో గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ సిపిడిసిఎల్ ఎస్ ఈ సత్యానందం, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసిల్దారు సురేషు, విద్యుత్ ఈ ఈ లు కృష్ణా నాయక్, సుధా సుధాకర్ తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

# జన్మదిన శుభాకాంక్షలు



**మచిలీపట్నం,కలంకౌంటర్** : మచిలీపట్నం కో ఆప్షన్ సభ్యుడు తుమ్మలపల్లి జగన్నాథం జన్మదినోత్సవం సందర్భంగా చిరు సత్కారం చేసిన జ్యూయలరీ అసోసియేషన్ అధ్యక్షుడు యర్ర శ్రీనివాస్ ,కొప్పర్తి గోపాల్ .

# అగ్ని ప్రమాద నివారణ - ప్రతి ఒక్కరి బాధ్యత!





**మచిలీపట్నం,కలంకౌంటర్** : ఫైర్ అవేర్‌నెస్ వారంలో భాగంగా, వరం సెంట్రల్ మాల్ & మల్టిప్లెక్స్, మచిలీపట్నంలో అగ్ని ప్రమాద అవగాహన , శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ఫైర్ డిపార్ట్‌మెంట్తో కలిసి లివరం సెంట్రల్ మాల్ & మల్టిప్లెక్స్ లిసమాఖ్యగా నిర్వహించింది. మా సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం, అగ్ని నిప్పును నియంత్రించే పద్ధతులు , ఖాళీ చేసే ప్రక్రియలపై ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వబడింది. మా సందర్శకులు, సిబ్బంది భద్రతే మా ప్రాధాన్యమైన లక్ష్యం.

# బూరగడ్డను కలిసిన కుంచె నాని



**మచిలీపట్నం,కలంకౌంటర్** : బందరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గా నియమితులైన టిడిపి నాయకుడు కుంచె దుర్గాప్రసాద్ (నాని ) గురువారం వేద వ్యాస్ ని కలిశారు. మచిలీపట్నంలోని ఆయన నివాసంలో కలసి ఆశీస్సులు తీసుకున్నారు. ఛైర్మన్ గా నియమితులైన నేపథ్యంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. బాధ్యతగా పనిచేసి రైతుల మెప్పు పొందాలని సూచించారు.



**జిల్లా ప్రధాన న్యాయమూర్తి గా గురువారం జిల్లా మచిలీపట్నంన్యాయస్థానంలో బాధ్యతలు స్వీకరించిన జి. గోపి .శుభాకాంక్షలు తెలిపిన న్యాయమూర్తులు,అధికారులు.**

-మచిలీపట్నం,కలంకౌంటర్ :

# జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో. విద్యార్థి కి 25000/- ఆర్థిక సహాయం



**నరసరావుపేట,కలంకౌంటర్** : భీమవరం విష్ణు కాలేజ్ నందు ఇంజనీరింగ్ 4వ సంవత్సరం చదువుతున్న చిన్ని శివ నరసింహారావు ఫ్రీ సీట్ ద్వారా కాలేజ్ లో 3న్నర సంవత్సరాలు కంప్లీట్ చేశాడు. ఇది నాలుగవ సంవత్సరం సెంకండ్ సేమ్ కంప్లీట్ ( 10 రోజుల్లో ) అవుతుంది .తన తండ్రి చిన్ని కొటేశ్వరావు గుంటూరు పట్టణంలోని మిర్చి వ్యాపారంలో గుమస్తా. తన కుటుంభ పరిస్థితులు దృష్ట్యా విద్య పూర్తి అవుతున్న సందర్భంలో ఫీజ్ పెండింగ్ ఉండటం వల్ల కాలేజ్ యాజమాన్యం ఒత్తిడితో ఎం చేయాలో తోచక పొన్నూరు కు చెందిన బాపనపల్లి ప్రభాకర్ రావు ని సంప్రదించగా ఆయన సహకారంతో ఫీజు కట్టడం జరిగినా హాస్టల్ ఫీజ్ మాత్రం కొంత పెండింగ్ ఉండిపోయింది .తన జాబ్ కోసం కంపెని ఇంటర్వ్యూ కి వెళ్లాలన్న సరైన బట్టలు, లేకపోవడం, కావాల్సిన డబ్బులు లేకపోవడంతో తన తెలిసిన వాళ్ళ ద్వారా ఎంత అడిగిన అంతకన్నా సహకారం అందక పోవడంతో ,పొన్నూరు ప్రభాకర రావు , ప్రకాశం జిల్లాలోని ఆర్యవైశ్య సంఘం మిత్రుడు చిరంజీవి ద్వారా పల్నాడు జిల్లా ఆర్యావైశ్య సంఘం అధ్యక్షులు అత్తులూరి సుబ్బారావు దృష్టికి తీసుకెళ్లగా వెంటనె స్పందించి తనకి కావలసిన బట్టలు, బ్యాగ్, షూస్, ఫీజ్ నిమిత్తం 5000/ సొంత డబ్బులు ఇవ్వడమే కాకా తనకు భవిష్యత్ లో ఉద్యోగం కోసం ఎక్కడికి ఇంటర్వ్యూ కి వెళ్లాలల్లన్న అయ్యే ఖర్చు కూడా ఇస్తానని తెలిపి మొత్తం 25,000/- వరకు బాబు కి అందించారు. తన మిత్రులు స్నేహితులు, ద్వారా ఇప్పటివరకు ఎంతో మంది బీద మధ్య తరగతి వారి అవసరాలకు ఆర్థిక సహాయం అందించామని తనకు సాధ్యం అయినంత వరకు జిల్లాలో వైశ్యులకు ఏ అవసరం వచ్చిన అండగా ఉంటానని అత్తులూరి సుబ్బారావు ( సుబ్బు ) అన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఆర్యావైశ్య సంఘం అధ్యక్షులు అత్తులూరి సుబ్బారావు, తడువాయి రామకృష్ణ, గౌరు శ్రీనివాసరావు, దొగిపర్తి విజయ్, రెడ్డి మురళి తుమ్మలపెంట మస్తాన్ ,కృష్ణ, చెరుకూరి సురేంద్ర, వనమా ప్రభాకర్ , ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా పకడ్బందీ చర్యలు

● వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ఏర్పాట్లు ● ఈ-వ్యర్థాల నిర్వహణ ఇతివృత్తంతో ఈ నెల స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,కలంకౌంటర్** : జిల్లాలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ లక్ష్మీశ వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా తీసుకున్న చర్యలు, వచ్చే వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలు, ఎంఎస్ఎంఈ సర్వే, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, పీఎం సూర్యఘర్, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల నిర్వహణపై తదితరాలపై సీఎస్ మార్గనిర్దేశం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా వేసవిలో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు పటిష్ట వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజావసరాలు, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో ఉన్న ఇసుక స్టాక్ యార్డ్‌లలో దాదాపు 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను సిద్ధం చేసి, ఇసుక కొరతకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అవసరమైన భూమిని అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని.. ఈ నెల మూడో శనివారం ఈ-వ్యర్థాల రీసైక్లింగ్ ప్రధాన అంశంతో కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పర్యావరణ హిత ఈ-వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ-వ్యర్థాల సేకరణపై శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఏపీఐఐసీ జెడ్‌ఎం కె.బాబ్జి, డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షల్లో వచ్చే మార్కులే జీవితం కాదు - ఏపీసి వెంకటసుబ్బయ్య






**కందుకూరు,కలంకౌంటర్** : పరీక్షల్లో వచ్చే మార్కులే జీవితం కాదని అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. కందుకూరు పట్టణంలో కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపల్ స్వాతి ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌన్సిలింగ్, మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, జి సి డి ఓ మమత, డిస్టిక్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ మధు పదవ తరగతి విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షల్లో వచ్చే మార్కులే జీవితం కాదని, మార్కులు తక్కువ వచ్చినా, ఒకవేళ పరీక్షల్లో తప్పినా చనికా వేశాలకు లోను కావద్దని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులపై తమ తల్లిదండ్రులు ఎంతో ఆశలు పెట్టుకుని ఉంటారని విద్యార్థులకు సూచించారు.

# తెలంగాణ సంస్కృతి, చారిత్రక వైభవం చాటి చెప్పేలా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించాలి

● ప్రపంచ సుందరి పోటీల నిర్వహణపై మంత్రి జూపల్లి సమీక్ష



**హైదరాబాద్,కలంకౌంటర్** : తెలంగాణ సంస్కృతి, చారిత్రక వైభవం చాటి చెప్పేలా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. గురువారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ప్రపంచ సుందరి పోటీల నిర్వహణపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విశిష్ట సంస్కృతులకు కొలువైన తెలంగాణ వైభవం ఒక్క హైదారాబాద్ నగరంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో నిక్షిప్తమై ఉందని, ఆయా ప్రాంతాలకు ప్రపంచ దేశాల సుందరీమ-ణులను తీసుకెళ్లి వాటి గొప్పతనాన్ని వివరించాలని అన్నారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, చారిత్రక కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా అందాల పోటీలను సద్వినియోగం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. విదేశీ పర్యాటకులను ఆకర్శించడం ద్వారా పర్యాటక రంగ అభివృద్ధి తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 20కి పైగా వేదికల్లో వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. వివిధ వేదికల్లో వేడుకలు నిర్వహిస్తున్నందున ఆయా ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని, జిల్లా కలెక్లర్లు, ఎస్పీలు, ఇతర అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని సుచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలను ఇందులో భాగాస్వాములను చేయాలన్నారు. ఈ సమీక్షలో పర్యాటక శాఖ సెక్రటరీ స్మితా సబర్వాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ జెండాగే హనుమంత్ కొండిబా, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ సోని బాలదేవి, యుజవన సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటుశ్వర్లు, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థికి చేయూత



**మచిలీపట్నం,కలంకౌంటర్** : గుడివాడలో డిగ్రీ చదువుతున్న పేద విద్యార్థినికి జంగాల ప్రశాంత్ కుమార్ ఆర్థిక సాయం అందజేశారు.వాసవి క్లబ్ ఐ పి సి ఎండూరి సురేష్ విద్యార్థిని పరిస్థితి వివరించడంతో స్పందించిన ప్రశాంత్ సాయం చేయడం పట్ల పలువురు అభినందించారు.

# మజ్జిగ పంపిణీ





**తిరువూరు,కలంకౌంటర్** : తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com